క్లుప్తంగా


నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గురువారం ఉదయం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి బుధవారం తెలిపారు. కొమరగుంట గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నకొమరగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధితో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలో గురువారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు విజయపురం మండలం జగన్నాథపురం పంచాయతీలో అంచనా విలువ రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయాన్ని, అంచనా విలువ రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభిస్తారు. అనంతరం నగరి మున్సిపాలిటీ సత్రవాడ-1, సత్రవాడ-2, కరకంతాపురం సచివాలయంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం వడమాలపేట మండలం అప్పలాయగుంట సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు.

27న తోపు వేలం



పుత్తూరు రూరల్: స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ తోపు ఆవరణ స్థలం బహిరంగ వేలం ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 18వ తేదీ నుంచి 28 వరకు 10 రోజుల పాటు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తోపు ఆవరణలో తాత్కాలిక అంగళ్ల నిర్వహణ కోసం దేవదాయ శాఖ అధికారులచే వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.1 లక్ష ధరావత్తు చెల్లించాలని స్పష్టం చేశారు. హెచ్చుపాటదారుడు పూర్తి మొత్తాన్ని వెంటనే దేవస్థానానికి చెల్లించి రశీదు పొందాలని వెల్లడించారు.

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

వెదురుకుప్పం: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్‌లో పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి వనిత అన్నారు. బుధవారం వెదురుకుప్పంలో ఈ-క్రాప్ నమోదుపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది తక్షణమే స్పందించి ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతులకు సంబంధించి కార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. కౌలు రైతులు తమ వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు.


తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న అధికారులు

నగరి : మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్ బీ, సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. మంత్రి ఆర్కే రోజా ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు తాగునీటి సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కొత్త పైపులు ఏర్పాటు చేయాలని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.1.55 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బుధవారం పైపులైన్ ఏర్పాటు పనులు వేగంగా జరిగాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ నరేష్, ఏఈలు పరిశీలించారు.

పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: వారం వారం కడుపు నిండా మంచి భోజనం అందిస్తున్న మంత్రి రోజా మేలు ఎప్పటికీ మరువలేమని గర్భిణులు చెబుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు, బాలింతలు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న విషయం విదితమే. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణకాంత్, ప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్ నారాయణస్వామి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బలవర్ధకమైన ఆహారం.. నాణ్యమైన విద్య

నాడు బడి అంటే పిల్లలు బోరున ఏడ్చేవారు..! నేడు బడి అంటే బ్యాగు తగిలించుకుని సంతోషంగా పరుగులు తీస్తున్నారు.. కారణం.. చూడచక్కని యూనిఫాం, పాదాలకు సరిపడా షూస్, బ్యాగు నిండా బుక్స్, స్కూల్‌కు వెళ్లగానే రంగు రంగుల కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి. వెంటనే నోరూరించే రాగిజావ.. సరదాగా పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, మధ్యాహ్నం విందుభోజనంతో కూడిన పౌష్టికాహారం.. అందుకే పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. దీంతో ప్రతిరోజూ పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంటోంది.



కేఎం అగ్రహారం స్కూల్లో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

- ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థుల కోసం పటిష్ట చర్యలు
- ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద పథకం అమలు
- పిల్లలకు మంచి ఆరోగ్యంతో పాటు నాణ్యమైన విద్య అందించాలన్నదే లక్ష్యం
- వారంలో 3 రోజుల పాటు రాగిజావ, 5 రోజుల పాటు గుడ్డు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నగరి నియోజకవర్గంలోని విద్యార్థుల వివరాలు:

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
నగరి	89	8,312
పుత్తూరు	80	6,286
నిండ్ర	46	2,048
విజయపురం	45	2,062
వడమాలపేట	43	2,452
మొత్తం	303	21,460

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరగాలని, నాణ్యమైన చదువుతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న ధృడ సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళణ చేసింది. నాడు-నేడు పేరిట పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ప్రభుత్వం పిల్లల చదువుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.



జగనన్న గోరుముద్ద లోగో

జగనన్న గోరుముద్ద మెనూ:

- సోమవారం: వెజ్ పలావ్, గుడ్డు, కూర, పొంగల్ చట్నీ, చిక్కీ
- మంగళవారం: రాగిజావ, పులిహోర, టమోట పచ్చడి, దొండకాయ పచ్చడి, గుడ్డు
- బుధవారం: వెజ్ పలావ్, బంగాళదుంప కుర్మా, చట్నీ, గుడ్డు, చిక్కీ
- గురువారం: రాగిజావ, సాంబార్ బాత్, చట్నీ, గుడ్డు
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ
- శనివారం: రాగిజావ, ఆకుకూరతో అన్నం, పప్పుచారు, గుడ్డు, స్వీట్ పొంగల్

అలాగే విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పవచ్చని భావించారు. ఇందుకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని మరింత మెరుగుపరిచి 'జగనన్న గోరుముద్ద' పేరిట పోషకాహారాన్ని అందిస్తోంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా ప్రభుత్వమే రూ.కోట్లు వెచ్చించి బలవర్ధకమైన ఆహారాన్ని పిల్లలకు అందేలా చూస్తోంది. నగరి నియోజకవర్గంలోని మొత్తం 303 వివిధ పాఠశాలలు ఉండగా, 21,460 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం తింటున్నారు. పిల్లలకు మంచి ఆరోగ్యంతో నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న గోరుముద్ద బాగుంది



జగనన్న గోరుముద్ద అంటూ పెడుతున్న భోజనం ఎంతో బాగుంది. రోజూ పలావ్, గుడ్డు, చిక్కీ పెడుతున్నారు. రాగిజావా ఇస్తున్నారు. మా పాఠశాల ఎంతో బాగుంటుంది. రంగు రంగు బొమ్మల మధ్యన చక్కగా చదువుకొంటున్నాము.

– పి.లోకేశ్వరి, 8వ తరగతి, గొల్లపల్లి, పుత్తూరు మండలం

రాగిజావా నాకు ఎంతో ఇష్టం



రాగిజావ అంటే నాకు ఎంతో ఇష్టం. రోజు మార్చి రోజు ఇస్తున్నారు. రోజూ ఇస్తే బాగుంటాది. ప్రార్థన పూర్తవగానే అందరం క్యూలో నిల్చొని రాగిజావ తీసుకొంటాం. రోజూ కోడి గుడ్డు పెడుతున్నారు. రోజు మార్చి రోజు చిక్కీ కూడా ఇస్తున్నారు. పలావ్, సాంబార్ బాత్, పులిహోర అన్నీ బాగుంటున్నాయి. కడుపు నిండా తింటున్నాము.

– డి.జ్యోత్స్న, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, పుత్తూరు

పకడ్బందీగా అమలు చేస్తున్నాం..



జగనన్న గోరుముద్ద పథకం అమలుకు పకడ్బందీ కార్యాచరణను అమలు చేస్తున్నాం. వారంలో మూడు రోజుల పాటు ఉదయం 9 గంటలకు రాగిజావ అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్లు పర్యవేక్షిస్తుంటారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, రుచి, శుభ్రతలపై తగిన జాగ్రత్తలు వహిస్తున్నాం.

– తిరుమలరాజు, ఎంఈఓ, పుత్తూరు

గుర్తుండిపోయేలా విద్యాబుద్ధులు నేర్పండి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ విజయ్‌కుమార్

కార్వేటినగరం: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధనలు చేయాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజంలో మహోన్నతమైనదన్నారు. అంతటి గొప్ప వృతిలో ఉన్న ఉపాధ్యాయులు గ్రామస్తులు, విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. అనంతరం సర్పంచ్ దివ్య మాట్లాడుతూ ఆర్కేవీబీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో, విద్యలో ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. ఇదే ఒరవడిని కొనసాగేలా నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయులు చూడాలని సూచించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆర్కేవీబీ పేట స్కూల్ మండలంలోనే టాప్‌గా నిలిచేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ఎంఈఓ రాజేంద్రన్‌కు సన్మానం



ఎంఈఓ రాజేంద్రన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయసంఘం నేతలు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : ఇన్‌చార్జ్ ఎంఈఓగా పని చేసి పదోన్నతిపై బంగారుపాళ్యం మండల విద్యాశాఖ అధికారిగా వెళ్లిన రాజేంద్రన్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. గతంలో ఇన్‌చార్జ్ ఎంఈఓగా విద్యాభివృద్ధికి కృషి చేసిన రాజేంద్రన్‌ను గంగాధరనెల్లూరు మండలం ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులుశెట్టి, ఎంఈఓ-2 గుణశేఖర్‌రెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతలు కలసి దుశ్శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు మాట్లాడుతూ రాజేంద్రన్ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సంఘ నేతలు పాల్గొన్నారు.

కందిపప్పు విక్రయ కేంద్రాలు ప్రారంభం



కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

నగరి : ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్కువ కందిపప్పు విక్రయించే ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం పౌరసఫరాలశాఖ ఆదేశాల మేరకు పళ్లిపట్టు రోడ్డులో ఐదు కందిపప్పు విక్రయ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు విక్రయ కేంద్రాల్లో రూ.140 కే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో లభిస్తుందన్నారు. త్వరలో ధరల నియంత్రణ జరుగుతుందని అప్పటి వరకు తక్కువ ధరకు అందించే విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు ఓ వరం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): జగనన్న సురక్ష పథకం ప్రజలకుగో వరం లాంటిదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గుంటిపల్లె, రామకృష్ణాపురం పంచాయతీల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పలు సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల్లోనే అందించడం ఒక బృహత్తర కార్యక్రమమన్నారు. మొత్తం 11 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆయన లబ్దిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గోవిందరెడ్డి, సర్పంచ్ దూది వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



శ్రీకావేరిరాజుపురం ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మురళి

పాలసముద్రం: మండల పరిధిలోని చిన్నారులకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ, సూపర్‌వైజర్ మురళి తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్యపరీక్షను వారు సందర్శించారు. సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయడం ద్వారా పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు కూడా నెలసరి వైద్యపరీక్షలు చేయించుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించుకుంటే మాతాశిశు మరణాలు జరగవని తెలిపారు. ఆశా కార్యకర్తలు గర్భిణులకు వారు ప్రసవం వరకు వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత, ఏఎన్‌ఎం రేవతి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జ్యోతి

పుత్తూరు రూరల్: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రత్యేకించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని విశ్వభారతి జ్ఞానజ్యోతి ట్రస్ట్ నిర్వాహకులు ఎస్.జ్యోతి కుమారస్వామిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక 20వ వార్డు కల్యాణపురం గ్రామంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో గర్భసంచి, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. వైద్యశిబిరం నిర్వహించడానికి సహకరించిన తిరుపతికి ఎస్‌వీఐ క్యాన్సర్ కేర్ సెంటర్ డాక్టర్స్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామాల నుంచి వచ్చిన సుమారు 100 మంది మహిళలకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, కౌన్సిలర్ చిట్టిబాబు, ప్రోగ్రాం మేనేజర్ పి.వి.హేమంత్‌కుమార్, డాక్టర్ భార్గవ్, కోఆర్డినేటర్ వి.రెడ్డికుమారి, పి.శివ, చైతన్య, నాయకులు మనోహర్‌రెడ్డి, బుజ్జి, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

వెదురుకుప్పం: రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఏడీఏ మధుసూదన్ అన్నారు. బుధవారం వెదురుకుప్పంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉంటూ పంటల సాగులో సూచనలు, సలహాలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఓ వనిత, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి

- మండల మీట్‌లో ఎంపీపీ దీప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నిండ్ర: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎంపీపీ దీప తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సర్పంచ్‌లదే అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటికీ ఎవరికైనా పథకాలు అందకపోతే, వారి సమస్య పరిష్కరించి పథకాలు అందేలా చూడడమే లక్ష్యమన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి తులసిరాం తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు రక్త పరీక్షలు చేసి, మెరుగైన వైద్యసేవలు అందించాలని కోఆప్షన్ సభ్యులు అనిల్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు కార్యక్రమం చేపట్టాలని, మండలంలో 257 మంది ఏళ్లలోపు పిల్లలు ఉన్నారని వీరికి నమోదు చేయించాలని నగరి సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. స్కూళ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.3 కోట్లతో 12 స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్‌రాజు తెలిపారు. మండలంలో రీసర్వే కార్యక్రమాలు 7 రెవెన్యూ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అమరేంద్రబాబు తెలిపారు. ఇరుగువాయి గ్రామంలో అర్హత కలిగిన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ రాజేష్ అధికారులను కోరారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా సరఫరా అయ్యే నీరు గ్రామాల్లో సరఫరా కావడం లేదని కావునూరు ఎంపీటీసీ విజేష్ తెలిపారు. పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో జగనన్న ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఏఈ శ్రీధర్‌రాజు కోరారు. కావునూరు చెరువులో నుంచి కొంతమంది అక్రమంగా మట్టిని తరలిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు ఇరిగేషన్ అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ అరుణ, వైద్యాధికారి సుమలత, ఎంఈఓ వసుమతి, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, పీఆర్ ఏఈ వీరభద్రం, ఏపీఎం చంద్రకళ, ఏపీఓ ఇందుమతి, ఇరిగేషన్ ఏఈ మురళి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, ఎంపీటీసీ విజేష్, మంజుల, పంచాయతీ సర్పంచ్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తవెంకటాపురంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారు రక్తహీనతకు గురికాకుండా రోజు వారి తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వారి చేసుకోవాల్సిన ఆరోగ్య పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా గర్భిణుల నమోదు చేసే ఈ ఆశా యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్ రాజు, మెడికల్ అధికారి డాక్టర్ ఎల్.ప్రశాంతి, డాక్టర్ వాణి, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ దానివేల్, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందించండి

- డిప్యూటీ కలెక్టర్ భవాని



ఓటర్ నమోదుపై బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ కలెక్టర్ భవానీ

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): ఓటర్ల నమోదులో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని డిప్యూటీ కలెక్టర్ భవాని అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితా ప్రకారం సర్వే నిర్వహించి, గ్రామాల్లో లేకుండా బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, అదేవిధంగా మరణించిన వారిని క్షుణ్ణంగా గుర్తించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు బీఎల్‌ఓలకు సహకరించి నకిలీ ఓట్లను తొలగించాలని సూచించారు. ఇతర గ్రామాల్లో స్థిరపడిన వారికి ఆయా గ్రామాల్లోనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



సర్టిఫికెట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీ బాలాజీ

విజయపురం (నగరి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతోందని వైస్ ఎంపీపీ బాలాజీ అన్నారు. బుధవారం కేవీపురంలో సర్పంచ్ రజని అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 210 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. అనంతరం సర్పంచ్ రజని మాట్లాడుతూ గతంలో ఏదైనా సర్టిఫికెట్లు కావాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఇంటి వద్దే అక్కడికక్కడే పరిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ వెంకట్రాయులు, సర్పంచ్ కుమార్, నాయకులు బాలకృష్ణమనాయుడు పాల్గొన్నారు.

నగరి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు సాయం



ఫొటోగ్రాఫర్లకు ఆర్థికసాయం అందిస్తున్న కీర్తీచావ్లా

నగరి : నగరి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ వారు నిర్మించనున్న భవనానికి సినీ నటి కీర్తీచావ్లా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. తన మేనేజర్ రామానుజం చలపతితో బుధవారం కాకవేడులో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయానికి విచ్చేసిన ఆమె తొలుత ఆలయానికి గంటను వితరణగా అందించారు. అనంతరం అక్కడకు విచ్చేసిన ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులను పలకరించిన ఆమె వారి భవన నిర్మాణానికి రూ.5 వేలు అందించారు. త్వరలో మరో రూ.లక్ష అందజేస్తానని చెప్పినట్లు చలపతి తెలియజేశారు. కార్యక్రమంలో నగరి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోవడం వల్లే టీడీపీ అక్కసు



వెదురుకుప్పం: ప్రజల్లో ఉనికి కోల్పోవడంతో టీడీపీ నేతలు సంక్షేమ పాలన అందిస్తున్న రాష్ట్రప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంలో టీడీపీ ఖాళీ అయిందన్న అక్కసుతోనే ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని చిత్తూరులో జరిగిన జగనన్న తోడు కార్యక్రమానికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఈక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్‌తో పాటు అధికారులు, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆనందరెడ్డి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. అయితే ఓవర్గం మీడియా జరిగిన విషయాన్ని పక్కన పెట్టి, వ్యక్తిగత కార్యదర్శితో కార్యక్రమాన్ని జరిపించేశారంటూ వక్రభాష్యం చెప్పారని ఆరోపించారు. ఇలాంటి అసత్యపు వార్తలు, అభూత కల్పనలు సృష్టించి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేయడం భావ్యం కాదన్నారు.

వేమన పద్యాలపై చిత్రలేఖన పోటీలు

తిరుపతి కల్చరల్: వేమన పద్యాలలోని భావా న్ని వ్యక్తీకరించేలా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, శ్రీకళాక్షేత్రం కార్యదర్శి సాగర్ తెలిపారు. వారు బుధవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 6, 7, 8 తరగతు లు, 9, 10, ఇంటర్, డిగ్రీ ఆపై తరగతుల విద్యార్థులకు మూడు విభాగాలుగా పోటీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు చిత్రించిన చిత్రాలను ఆగస్టు 15వ తేదీలోపు మెయిల్ చేయాలని సూచించారు. మొదటి రెండు విభాగాల విజేతలకు రూ.3000, రూ.2000, రూ.1000 చొప్పున, మూడో విభాగం విజేతలకు రూ.4000, రూ.3000, రూ.2000 నగదు బహుమతి అందజేస్తామన్నారు.

గోశాలకు ఆవు, దూడ వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ గోశాలకు ఏర్పేడు మండలం చింతపాళెం గ్రామానికి చెందిన చింత బాలప్రసాద్, కుటుంబ సభ్యులు బుధవారం ఆవు, దూడను వితరణగా అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.